క్లుప్తంగా

నాతవరం ఇన్‌చార్జి ఎంఈవోగా సత్యనారాయణ


సత్యనారాయణను అభినందిస్తున్న ఎంఈవో -2 వరహాలబాబు, అమృత్‌కుమార్

నాతవరం: మండల విద్యా శాఖ ఇన్‌చార్జి అధికారి(1)గా గొలుగొండ ఎంఈవో ఓ. సత్యనారాయణ నియమితులయ్యారు. ఆయన మంగళవారం స్థానిక ఎమ్మార్సీ భవనంలో బాధ్యతలు స్వీకరించారు. గతంలో ఇక్కడ పని చేసిన ఎంఈవో -1 తాడి అమృత్‌కుమార్ గత నెల పదవీ విరమణ చేశారు. ఆయన స్థానంలో సత్యనారాయణకు డీఈవో వెంకటలక్ష్మమ్మ అదనపు బాధ్యతలు అప్పగించారు. బాధ్యతలు స్వీకరించిన సత్యనారాయణను ఎంఈవో -2 కామిరెడ్డి వరహాలబాబు పూర్వపు ఎంఈవో తాడి అమృత్‌కుమార్, ఎమ్మార్సీ సిబ్బంది పుష్పగుచ్ఛంతో శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ నిబంధనల ప్రకారం ఉన్నతాధికారుల ఆదేశాలు అనుసరించి విద్యను మరింత మెరుగుపరిచేందుకు కృషి చేస్తానన్నారు.

నేటి నుంచి లంపీస్కిన్ నివారణ టీకాలు


లంపీస్కిన్ వ్యాధి సోకిన ఆవు

రోలుగుంట: గ్రామాల్లో బుధవారం నుంచి పశువులకు లంపీస్కిన్ నివారణ టీకాలు వేయనున్నామని స్థానిక పశు వైద్యాధికారి నూకేశ్వరరావు తెలిపారు. ఈ వ్యాధి నివారణ కోసం టీకాలు వేసే కార్యక్రమాన్ని చేపట్టనున్నట్టు ఆయన మంగళవారం విలేకరులకు వెల్లడించారు. తమ శాఖ ఈ వ్యాధిని అరికట్టేందుకు అన్ని చర్యలు చేపడుతుందన్నారు. బుధవారం దిబ్బలపాలెం, కొంతలం బి.బి.పట్నం గ్రామాల్లో టీకాలు వేసే కార్యక్రమాన్ని చేపడతామన్నారు. సీజనల్‌గా వచ్చే లంపీస్కిన్ పట్ల పాడిరైతులు అప్రమతంగా ఉండాలన్నారు.

ముమ్మరంగా పారిశుధ్య పనులు


కింతలి వల్లాపురంలో మురుగు కాలువలు శుభ్రం చేస్తున్న దృశ్యం

మాడుగుల రూరల్: వారం రోజులుగా కురుస్తున్న వర్షాలకు గ్రామాల్లో అంటువ్యాధులు ప్రబలకుండా పంచాయతీ కార్యదర్శుల పర్యవేక్షణలో ముమ్మరంగా పారిశుధ్య పనులు చేపడుతున్నారు. సర్పంచ్ తాళ్లపురెడ్డి రాంబాయి సారథ్యంలో కార్యదర్శి ఎస్. అప్పారావు పర్యవేక్షణలో మంగళవారం కింతలి వల్లాపురంలో తుప్పలు, చెత్తాచెదారాలు తొలగించారు. మురుగు కాలువల్లో సిల్ట్ తీశారు. అంటు వ్యాధులు ప్రబలకుండా ప్రజలు తగు ఆరోగ్య జాగ్రత్తలు తీసుకోవాలని సర్పంచ్ కోరారు. నాయకులు తాళ్లపురెడ్డి రాంబాబు, తదితరులు పాల్గొన్నారు.

కుష్టు పట్ల అప్రమత్తం


ప్రజలకు అవగాహన కల్పిస్తున్న సీహెచ్‌వో ప్రసాద్

గొలుగొండ: కుష్టు పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, వ్యాధి సోకితే ఆందోళన చెందవద్దని కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ ప్రసాద్ తెలిపారు. కుష్టు వ్యాధి నిర్మూలన కార్యక్రమంలో భాగంగా మంగళవారం పాకలపాడులో ప్రతి ఇంటికి వైద్య సిబ్బంది వెళ్లి వ్యాధి లక్షణాలపై అవగాహన కల్పించారు. ప్రాథమికంగా ఒకరికి గ్రామంలో కుష్టు లక్షణాలు ఉన్నట్లు గుర్తించామని సీహెచ్‌వో ప్రసాద్ తెలిపారు. అవసరమైన మందులు అందించి వ్యాధి నిర్మూలకు చర్యలు తీసుకుంటున్నట్లు చెప్పారు.

అంధకారంలో తాండవ ప్రాజెక్టు

- వెలగని విద్యుత్ లైట్లు
- చిమ్మచీకట్లోనే కాలం వెళ్లదీస్తున్న సిబ్బంది
- సెల్‌ఫోన్, టార్చిలైట్ల వెలుగులో నీటిమట్టం పరిశీలన


తాండవ గట్టుపై అలంకార ప్రాయంగా దర్శనమిస్తున్న విద్యుత్ స్తంభాలు

నాతవరం: జిల్లాలోనే మేజరు ప్రాజెక్టు తాండవ రిజర్వాయరుపై విద్యుత్ లైట్లు పని చేయడం లేదు. నెలలు తరబడి అంధకారంలో ఇక్కడ సిబ్బంది కాలం వెళ్లదీయాల్సిన దుస్థితి నెలకొంది. రెండు జిల్లాల పరిధిలో ఏటా ఖరీఫ్ సీజన్‌లో 52 వేల ఎకరాలకు సాగు నీరు అందించే ఈ ప్రాజెక్టు పట్ల అధికారులు పూర్తిగా నిర్లక్ష్యం వహిస్తున్నారు. ఏటా ఖరీఫ్ సీజన్‌కు ముందు తాండవ రిజర్వాయరుపై విద్యుత్ లైట్లతోపాటు స్పిల్ వే గేట్లు వద్ద జనరేటర్ పూర్తిస్థాయిలో మరమ్మతులు చేసేవారు. ఈ ఏడాది ఆ ఊసే లేదు. స్పిల్ వే గేట్లు వద్ద విద్యుత్ లైట్లతోపాటు సరఫరాలో అంతరాయం ఏర్పడితే జనరేటర్ సైతం పనిచేయడం లేదు. ప్రస్తుతం తుపాను కారణంగా కురుస్తున్న వర్షాలకు తాండవ ప్రాజెక్టులోకి క్రమేపీ నీటిమట్టం పెరుగుతోంది. ఏ సమయంలో ఎటువంటి ప్రమాదం ముంచుకొస్తుందోనని ప్రాజెక్టుపై జేఈ రామకృష్ణ, ఇతర సిబ్బంది రేయింబవళ్లు పర్యవేక్షిస్తున్నారు. ప్రాజెక్టుకు ఇరువైపులా దట్టమైన అటవీ ప్రాంతాన్ని తలపించేలా కొండలు ఉండటంతో సాయంత్రం అయ్యేసరికి చిమ్మచీకట్లో సిబ్బందికి కాపల కాస్తున్నారు. విద్యుత్‌లైటింగ్ లేకపోవడంతో తాండవ రిజర్వాయరులో ప్రధాన గేట్లు వద్ద నీటిమట్టం చూసేందుకు సెల్‌ఫోన్ లైట్లు, టార్చిలైట్లు సాయంతో సిబ్బంది చూస్తున్నారు. అదేవిధంగా వరదల ఉధృతి పెరిగి తాండవ ప్రాజెక్టులో నీటిమట్టం ప్రమాద స్థాయికి వస్తే, ప్రమాదాన్ని నివారించేందుకు అంధకారంలోనే స్పిల్ వే గేట్లు ఎత్తి నదిలోకి నీటిని విడుదల చేయాల్సిన పరిస్థితి ఉంది. ఇక్కడకు వచ్చే సందర్శకులు సైతం సాయంత్రం 5 గంటలు దాటితే ప్రాజెక్టు ప్రాంగణమంతా చీకటిమయంగా కావడంతో ఇబ్బందులు పడుతున్నారు. ప్రాజెక్టుపై విద్యుత్ స్తంభాలు శిథిలమయ్యాయి. వాటి స్థానంలో కొత్తవి ఏర్పాటు చేయకపోవడంతో అలంకారప్రాయంగా దర్శనమిస్తున్నాయి. ఈ విషయంపై జేఈ రామకృష్ణ వివరణ కోరగా.. విద్యుత్ లైటింగ్, ఇతర మరమ్మతుల కోసం నిధులకు ప్రతిపాదనలు పంపామని, ఇంతవరకు పైసా విడుదల కాక పనులు చేయలేదన్నారు.

సచివాలయాల్లో పారదర్శకంగా ఆధార్ సేవలు


దేవరాపల్లిలో ఆధార్ నమోదు శిబిరాన్ని పర్యవేక్షిస్తున్న ఇన్‌చార్జి ఎంపీడీవో అప్పలరాజు


మాడుగుల రూరల్: కె.జె.పురంలో ఆధార్ క్యాంపును పరిశీలిస్తున్న ఈవోపీఆర్డీ మీనాకుమారి

దేవరాపల్లి: సచివాలయాల్లో నిర్వహిస్తున్న ఆధార్ కేంద్రాల్లో పారదర్శకంగా సేవలందించాలని ఇన్‌చార్జి ఎంపీడీవో ఎస్. అప్పలరాజు సూచించారు. దేవరాపల్లి సచివాలయం-1, 2 కేంద్రాల్లో ఆధార్ సేవా నమోదు శిబిరాలను ఆయన మంగళవారం పర్యవేక్షించారు. సక్రమంగా సేవలందిస్తున్నారా లేదా అని స్థానికులను అడిగి తెలుసుకున్నారు. కొత్త ఆధార్ నమోదుతోపాటు పేర్లు మార్పు, బయోమెట్రిక్ అప్‌డేట్, డాంక్యుమెంట్ అప్‌డేట్ తదితర సేవలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఆధార్ సేవల కోసం పాన్‌కార్డు, ఓటరు కార్డు, జనన ధ్రువీకరణ పత్రం, పదో తరగతి మార్కుల లిస్టు తదితర పత్రాలను తీసుకురావాలని సూచించారు. బుధవారం రైవాడ, కాశీపురం గ్రామాల్లో ఆధార్ నమోదు శిబిరాలను నిర్వహించనున్నట్లు ఇన్‌చార్జి ఎంపీడీవో స్పష్టం చేశారు.

మాడుగుల రూరల్: గ్రామాల్లో ఆధార్ క్యాంపులను ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని మండల పంచాయతీరాజ్ గ్రామీణాభివృద్ధి అధికారి పి.ఎస్.ఎల్.వి. మీనాకుమారి పేర్కొన్నారు. కె.జె.పురం, కె. వల్లాపురం, వీరనారాయణం, ఎల్. పొన్నవోలు గ్రామ సచివాలయాల్లో మొబైల్ ఆధార్ క్యాంపులను ఆమె మంగళవారం పరిశీలించారు. ఈ నెల 23 నుంచి 27వ తేదీ వరకు ఆధార్ అప్‌డేట్ చేస్తారన్నారు. చిన్నారులకు చేయించాలన్నారు. జె.డి.పేట, ఒమ్మలి, ఎం. కోటపాడు, తాటిపర్తి, గ్రామ సచివాలయాల్లో ఈ కార్యక్రమం నిర్వహించినట్లు ఎంపీడీవో ఆర్ కాళీ ప్రసాదరావు తెలిపారు.

వడ్డాదిలో ఘనంగా మోదకొండమ్మ పండగ


వడ్డాదిలో అమ్మవారి పండగలో పాల్గొన్న భక్తులు


అమ్మవారి ఆలయం వద్ద ఘటాలతో బారులు తీరిన భక్తులు

బుచ్చెయ్యపేట: వడ్డాది మేజర్ పంచాయతీలో గ్రామదేవత మోదకొండమ్మ పండగ మంగళవారం అంగరంగ వైభవంగా జరిగింది. తెల్లవారుజాము నుంచి రాత్రి వరకు ఇక్కడ అమ్మవారి ఆలయానికి భక్తులు బారులు తీరారు. ప్రత్యేక పూజలు చేసి మొక్కులు చెల్లించుకున్నారు. ఈ సందర్భంగా సాయంత్రం నేలడ్యాన్స్, తప్పెటగుళ్ల, శక్తివేషాలు, భారీ మందుగుండు సామగ్రి కాల్పుల మధ్య అమ్మవారి ఘటాలతో ఊరేగింపుగా ఆలయానికి చేరుకుని ప్రత్యేక పూజలు చేశారు. పాడి పంటలు బాగా పండాలని, ఆయురారోగ్యాలతో సుఖసంతోషాలతో అంతా ఉండాలని గ్రామస్తులు ఆషాఢ మాసంలో పండగ చేయడం ఆనవాయితీగా వస్తోంది.

వర్షాలకు అధ్వానంగా కృష్ణదేవిపేట రోడ్డు


గొలుగొండ సమీపంలో గోతులతో ప్రధానరోడ్డు


లింగంపేట వద్ద అధ్వానంగా ప్రధానరోడ్డు

గొలుగొండ: కృష్ణదేవిపేట-నర్సీపట్నం ప్రధాన రోడ్డులో పలు చోట్ల గోతులు ఏర్పడి ప్రమాదాలకు నిలయంగా మారింది. వారం రోజులు నుంచి కురుస్తున్న భారీ వర్షాలకు ఈ పరిస్థితి నెలకొంది. ఈ మార్గంలో గొలుగొండ, పప్పుశెట్టిపాలెం, లింగంపేట, రామచంద్రాపురం గ్రామాల వద్ద మరింత దారుణంగా ఉంది. ఇక్కడ ఏర్పడిన గోతుల్లో వర్షపు నీరు చేరడంతో వాహనదారులు గమనించక ప్రమాదాలకు గురవుతున్నారు. చిన్న వాహనాలు బోల్తా పడుతున్నాయి. ఈ మార్గంలో నిత్యం వేలాది వాహనాలు రాకపోకలు చేయడం వల్ల తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. అధికారులు స్పందించి రోడ్డు మరమ్మతులు చేయాలని వాహనదారులు కోరుతున్నారు.

కనకదుర్గమ్మకు అర కిలో వెండి బహూకరణ


అమ్మవారి ఆలయంలో పీవీ రమణకు వెండిని అందిస్తున్న పందిరి రామారావు

అనకాపల్లి: స్థానిక గవరపాలెం సతకంపట్టు కనకదుర్గ అమ్మవారికి శ్రీకాకుళం జిల్లా పలాసకు చెందిన పందిరి రామారావు అర కిలో వెండి బహూకరించారు. ఈ సందర్భంగా రామారావు మాట్లాడుతూ పలాసలో నివాసం ఏర్పరచుకుని వ్యాపారం చేస్తున్నా. తన స్వగ్రామం అనకాపల్లి కావడంతో అమ్మవారిపై భక్తి ఎక్కువన్నారు. అందుకే తన వంతుగా అమ్మవారికి వెండి బహూకరించినట్లు తెలిపారు. అనంతరం ఆయన్ని ఆలయ వ్యవస్థాపకులు పీవీ రమణ శాలువాతో సత్కరించారు. కార్యక్రమంలో కమిటీ సభ్యులు ఎస్ఎం నాయుడు, బుద్ధ భూలోకనాయుడు తదితరులు పాల్గొన్నారు.

ఫార్మా ప్రమాదంపై సమగ్ర విచారణ చేపట్టాలి

అనకాపల్లి: పరవాడ ఫార్మాసిటీలోని స్మైలెక్స్ ఫార్మా కంపెనీలో జరిగిన ప్రమాదంపై సమగ్ర విచారణ చేపట్టి, మరణించిన వ్యక్తి కుటుంబానికి ప్రభుత్వం రూ.కోటి నష్టపరిహారం అందించాలని సీఐటీయూ జిల్లా నాయకుడు వీవీ శ్రీనివాసరావు మంగళవారం ఓ ప్రకటనలో డిమాండ్ చేశారు. ఈ ప్రమాదంలో ఒరిస్సాకు చెందిన కబీ అనే కార్మికుడు మృతి చెందడం బాధాకరమన్నారు. ఇటీవల అచ్యుతాపురం, రాంబిల్లిలో జరిగిన ప్రమాదాలు మరువకముందే మరో ప్రమాదం సంభవించిందన్నారు. ఫార్మా పరిశ్రమల్లో భద్రతా చర్యలు, ప్రమాదాలపై కలెక్టర్ సమావేశాలు నిర్వహించిన వారం రోజుల్లోపే రెండు ప్రమాదాలు జరగడం దారుణమన్నారు.

విజ్ఞానం పెంపునకు శిక్షా సప్తాహ్

పాఠశాలల్లో బోధనోపకరణాల ప్రదర్శన


మాకవరపాలెం: పాపయ్యపాలెంలో అభ్యసన సామగ్రి ప్రదర్శనను తిలకిస్తున్న ఎంఈవో మూర్తి


నర్సీపట్నం: బోధనోపకరణాలను పరిశీలిస్తున్న ఎంఈవో నాగేంద్ర


రోలుగుంట: కుసుర్లపూడి పాఠశాలలో ఫ్లకార్డులు ప్రదర్శించిన విద్యార్థులతో ఉపాధ్యాయులు


చోడవరం రూరల్: విద్యార్థులలో జిజ్ఞాస నింపే కార్యక్రమాలు


దేవరాపల్లి హైస్కూల్‌లో బోధన సామగ్రిని పర్యవేక్షిస్తున్న ఎంఈవో-1 పడాల్‌దాస్

నర్సీపట్నం/మాకవరపాలెం: శిక్షా సప్తాహ్‌లో భాగంగా మంగళవారం నర్సీపట్నం మండలం చెట్టుపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో బోధనోపకరణాల ప్రదర్శన, ప్రాథమిక భావన పరిచయం చేసే విధానాలపై మేళా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ఎంఈవో జీవీఎస్ నాగేంద్ర హాజరయ్యారు. విద్యార్థులు, ఉపాధ్యాయులు తయారు చేసిన బోధనోపకరణాలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులతో బోధనోపకరణాలు తయారు చేయించటం వల్ల త్వరగా విషయ పరిజ్ఞానం పెరుగుతుందన్నారు. హెచ్‌ఎం పి.రామకృష్ణ, ఉపాధ్యాయుడు రాజుగోపాల్ తదితరులు పాల్గొన్నారు. అదేవిధంగా మాకవరపాలెం మండలం పాపయ్యపాలెం, శెట్టిపాలెంలో జరిగిన బోధన అభ్యసన సామగ్రిని ప్రదర్శించారు. మాకవరపాలెం ఉన్నత పాఠశాలలో హెచ్‌ఎం అచ్యుతరామయ్య, తూటిపాల ప్రాథమికోన్నత పాఠశాలలో హెచ్‌ఎం రాము విద్యార్థుల తల్లిదండ్రులతో సమావేశమయ్యారు. ఈ కార్యక్రమాలను ఎంఈవో పి.ఎస్.ఎన్.మూర్తి పర్యవేక్షించారు. విద్యాభివృద్ధికి అన్ని చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. పేరెంట్స్ కమిటీ చైర్మన్లతో పాటు ప్రజాప్రతినిధులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

విద్యార్థులలో నైపుణ్యాభివృద్ధి కార్యక్రమాలు

చోడవరం రూరల్/రోలుగుంట: శిక్షా సప్తాహ్ కార్యక్రమంలో భాగంగా అన్ని పాఠశాలల్లో విద్యార్థుల పునాది అభ్యసన, సంఖ్యా శాస్త్ర నైపుణ్యాభివృద్ధి కార్యక్రమాలను నిర్వహించారు. ఆయా పాఠశాలల హెచ్‌ఎంలు, సీఆర్‌ఎంటీలు సంయుక్తంగా స్థానిక వనరులతో తయారు చేసిన బోధన, అభ్యాసనలకు సంబంధించిన పరికరాలతో విద్యార్థులకు అవగాహన కల్పించారు. కార్యక్రమాలను సీఆర్‌ఎంటీ కె.వి.మహాలక్ష్మినాయుడు, జెడ్పీ జీహెచ్‌ఎస్, చోడవరం, అడ్డూరు, అంభేరుపురం, నర్సాపురం, సీమునాపల్లి ప్రాథమిక పాఠశాలల ప్రధానోపాధ్యాయులు ఐ.వి.రామిరెడ్డి, వేదుల లక్ష్మి, చైతన్య, వీర్రజు, భాస్కరరావు, నాగరాజు, మహేశ్వరి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు. రోలుగుంట మండలం కుసుర్లపూడి జెడ్పీ ఉన్నత పాఠశాలలో హెచ్‌ఎం మోహన్ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం నిర్వహించారు. ఎంఈవో జానుప్రసాద్ పర్యవేక్షించారు.

దేవరాపల్లి: శిక్షా సప్తాహ్-2024లో భాగంగా రెండో రోజు మంగళవారం ఒకటో తరగతి నుంచి భాషపై పట్టు సాధించేందుకు పునాది అభ్యసనం, సంఖ్యా శాస్త్రం నైపుణ్యాల అభివృద్ధిలో భాగంగా విద్యార్థులు వినుట, చదువుటకు సంబంధించి కృత్యాలను తయారీ చేయించి ప్రదర్శించారు. వీటిని విద్యార్థుల తల్లిదండ్రులు ఆసక్తిగా తిలకించారు. ఈ కార్యక్రమాలను మండలంలోని అన్ని పాఠశాలలో నిర్వహించగా, ఎంఈవోలు బి. పడాల్ దాస్, వి. ఉషారాణి పర్యవేక్షించి ప్రతిభ చూపిన విద్యార్థులను అభినందించారు.

నీట మునిగిన వరినారు



వి.వి.అగ్రహారంలో నీట మునిగిన వరినారును చూపిస్తున్న రైతు

మాడుగుల రూరల్: అల్పపీడన ద్రోణి ప్రభావంతో కురుస్తున్న వర్షాలతో వరినారు ఇంకా నీటి ముంపులోనే ఉంది. కొన్ని గ్రామాల్లో పల్లపు భూముల్లో వేసిన వరి పంట నీట మునగడంతో రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. వి.వి.అగ్రహారం పెదమడి కాలువ ఆయకట్టు పరిధిలో వరినారు పూర్తిగా ముంపునకు గురైంది. కె.జె.పురం, పప్పుశెట్టి చెరువు, మాడుగుల ఎం. కోడూరు, తదితర గ్రామాల్లో ఇదే పరిస్థితి నెలకొంది.

కెప్టెన్ లక్ష్మీసెహగల్ సేవలు చిరస్మరణీయం

కశింకోట: తేగాడలో స్వాతంత్ర్య సమరయోధులు కెప్టెన్ లక్ష్మీసెహగల్ వర్ధంతిని ఐద్వా ఆధ్వర్యంలో మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె చిత్రపటానికి ఐద్వా అధ్యక్షురాలు బి.ప్రభావతి పూలమాల వేసి నివాళులర్పించారు. ఆమె సేవలు చిరస్మరణీయమని కొనియాడారు. స్వాతంత్ర్యోద్యమంలో పాల్గొని ఆజాద్ హింద్ ఫౌజ్‌లో కెప్టెన్ హోదా పొంది, వృత్తి రీత్యా వైద్యురాలిగా సెహగల్ అందించిన సేవలను ప్రస్తుతించారు.

పెద్దేరులో 200 క్యూసెక్కుల నీరు విడుదల


జలాశయం నుంచి విడుదల చేసిన నీరు

మాడుగుల: పెద్దేరు జలాశయం ద్వారా మంగళవారం రాత్రి 200 క్యూసెక్కులు నీటిని దిగువకు విడుదల చేశారు. వారం రోజులుగా కురుస్తున్న వర్షాలకు జలాశయంలో నీటిమట్టం క్రమేపి పెరుగుతోంది. జలాశయం పూర్తిస్థాయి నీటిమట్టం 137 మీటర్లు కాగా, మంగళవారం సాయంత్రం నాటికి 136.50 మీటర్లకు చేరింది. కురుస్తున్న వర్షాలకు జలాశయంలోకి 500 క్యూసెక్కుల నీరు వచ్చి చేరుతుందని జేఈ జె.వి. సుధాకర్‌రెడ్డి తెలిపారు. జలాశయం పరిసర ప్రాంతంలో 10 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైందన్నారు.

సీసీఆర్‌సీ కార్డులతో పంటపై సర్వహక్కులు


సమావేశంలో మాట్లాడుతున్న ఏవో అప్పారావు

నర్సీపట్నం: సీసీఆర్‌సీ కార్డులతో కౌలు రైతులకు పంటపై సర్వహక్కులు ఉంటాయని వ్యవసాయశాఖ అధికారి డి.అప్పారావు పేర్కొన్నారు. మంగళవారం గబ్బాడ గ్రామ సచివాలయంలో కౌలు రైతులకు సీసీఆర్‌సీ కార్డులపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భూ యజమానికి నష్టం కలగకుండా కౌలుదారునికి అనేక లాభాలు కల్పించే సీసీఆర్‌సీ కార్డులను ప్రతి రైతు సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈ కార్డులతో రాయితీపై అందించే ఎరువులు, విత్తనాలు ఇతర పథకాలు పొందవచ్చన్నారు. ప్రకృతి వైపరీత్యాలు సంభవించినప్పుడు పంట నష్టపరిహారం, పంట రుణాలు, పంట అమ్మకం, సాగుదారుని పేరు మీద చేసుకోవచ్చన్నారు. కార్డు కాలపరిమితి 11 నెలలు ఉంటుందన్నారు. సర్పంచ్ రాజేశ్వరి మాట్లాడుతూ ఈ కార్డుల వల్ల భూ యజమానికి ఎలాంటి ఇబ్బంది ఉండదన్నారు. వైస్ సర్పంచ్ రాజునాయుడు, మాజీ ఎంపీటీసీ ఈర్ల రాజుబాబు, రైతులు, కౌలు దారులు, వీఆర్వో సింహాచలం, గ్రామ వ్యవసాయ సహాయకులు వెంకటరమణ, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

వారాడలో 133 మందికి వైద్య పరీక్షలు


రోగులను పరీక్షిస్తున్న వైద్యాధికారి సాయికిరణ్

కె.కోటపాడు: అపిడమిక్ సీజన్ కావడంతో ప్రజలు ఆరోగ్య జాగ్రత్తలు పాటించాలని వైద్యాధికారి సాయికిరణ్ తెలిపారు. లంకవానిపాలెం పీహెచ్‌సీ ఆధ్వర్యంలో మంగళవారం వారాడలో వైద్య శిబిరం నిర్వహించారు. 133 మంది రోగులకు వైద్యంతో పాటు ఉచితంగా మందులు అందించారు. గర్భిణులకు ఆరోగ్య పరీక్షలు చేశారు. పీహెచ్‌ఎన్.ప్రమీల, హెల్త్ అసిస్టెంట్ పి.త్రినాథ్, ఎంఎల్‌హెచ్‌పీ సుమ, ఏఎన్‌ఎం కుమారి పాల్గొన్నారు.

వ్యవసాయ పనుల్లోకి రైతన్నలు


రోలుగుంటలో పెసర బొట్టలు సేకరిస్తున్న రైతులు

రోలుగుంట: బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడనం బలహీనపడింది. దీంతో ఐదు రోజులుగా కురుస్తున్న వర్షాలు తెరిపినివ్వడంతో మండల రైతులు వ్యవసాయ పనుల్లో నిమగ్నమయ్యారు. శరభవరం, బుచ్చింపేట, రత్నంపేట, కొవ్వూరు తదితర గ్రామాల్లో దమ్ములు చేసుకుంటున్నారు. వ్యవసాయాధికారి ఎస్. విజయలక్ష్మి సూచనల మేరకు వర్షాలకు ముంపునకు గురైన ఆకుమడుల నుంచి బయటకు నీరు పోయే మార్గం చేసుకుంటున్నారు. రోలుగుంట, కొండపాలెం, వెలంకాయలపాలెం, ఎస్.కొత్తూరు, బుచ్చింపేట తదితర గ్రామాల్లో బొబ్బర, పెసర, మినప బొట్టలను ఏరుతున్నారు. రోజంతా చిన్నపాటి చినుకులు లేకపోవడంతో అపరాల పంట సేకరణకు అనుకూలంగా ఉండడంతో రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

పొంగి ప్రవహిస్తున్న గెడ్డలు


ప్రవహిస్తున్న బొడ్డేరు గెడ్డ

గొలుగొండ: భారీ వర్షాలకు గెడ్డలు పొంగి ప్రవహిస్తున్నాయి. వారం రోజుల నుంచి ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాలు కారణంగా బొడ్డేరు, దారగెడ్డ, వరహానది పొంగి ప్రవహిస్తున్నాయి. మంగళవారం వర్షం కురవకపోయినా గెడ్డలు ప్రవాహం మాత్రం తగ్గలేదు. బొడ్డేరు గెడ్డపై విప్పలపాలెం ఆయకట్టు దిగువున ముమ్మరంగా దుమ్ములు పట్టే పనుల్లో రైతులు ఉన్నారు. దారగెడ్డ ప్రాంతంలో ఇప్పటికే చాలా చోట్ల దమ్ములు పూర్తి చేశారు. బొడ్డేరు, దారగెడ్డల నుంచి ప్రవహించే వర్షం నీరు తాండవ జలాశయంలోకి చేరుతోంది.

భవిత కేంద్రంలో ఫిజియో సేవలు

కశింకోట: స్థానిక భవిత కేంద్రంలో ఫిజియోథెరపీ సేవలను వినియోగించుకోవాలని ఎంఈవో చిట్టిబాబు కోరారు. ఫిజియోథెరపీ సేవలను మంగళవారం ప్రారంభించి, మాట్లాడారు. మండలంలోని శారీరక దివ్యాంగ విద్యార్థుల కోసం ప్రతి మంగళవారం ఇక్కడ ఫిజియో సేవలు అందుబాటులో ఉంటాయన్నారు. ప్రత్యేక ఉపాధ్యాయుడు కె.వెంకటేశ్వరరావు, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.